# 44. సారీ, బాబాయిగారూ!

"నీవు అర్జంటుగా బయలుదేరి రావలయును, నీ మేనకోడలు పార్వతి పెద్ద ఇబ్బందిలో పడినది. ఈ కార్డునే టెలిగ్రాముగా భావించి వెంటనే వచ్చి ఆదుకోవలయును. ఇట్లు నీ అక్క నరసమ్మ."

ఏలూరు చేరేలోపుగా ఆ కార్డు ఎన్ని సార్లు చదువుకున్నానో! ఒక్కొక్కసారి ఒక్కొక్క ఆపద స్ఫురించి నా మేనకోడలు పార్వతి మీద కోపం, జాలి, అసహ్యం, చిరాకు లాంటి భావాలు కలిగి; ఆదుకోవలసిన పరిస్థితి ఏమిటో, పరిష్కరించవలసిన సమస్యలేమిటో తెలక- 'ఈ రైలేమిటి; సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ అని పేరు పెట్టుకొని లంఖణాల పాసింజరు లాగా నడుస్తోంది' అని విసుగు పుట్టింది.

నా మేనకోడలు పార్వతి, నా ఏకైక అక్కకి ఏకైక పుత్రిక, ఏలూరుకు సమీపంలో వున్న భీమడోలు గ్రామంలో ఒక చిన్నపాటి వ్యవసాయదారు కుటుంబంలో పుట్టింది. మాబావ, ఈ పార్వతి పదమూడేళ్ల పిల్లగా వున్నప్పుడు చనిపోయాడు. ఒక ఎకరం భూమి మాత్రం వున్నా, ఆ పొలాన్ని చేజారి పోకుండా కాపాడుకుంటూ, ఉపకారాల వలె కనుపించే రకరకాల వృత్తులు చేపట్టి అసామాన్య కార్యదక్షుడు అని పేరు పొందేడు. ఆ కుటుంబంలో మొగవాళ్లే ఐదవ తరగతి దాటి చదువుకోలేదు. అయినా పార్వతిని ఎనిమిదవ తరగతి వరకు చదివించి; మరణశయ్య మీద కూడా 'పార్వతిని మెట్రిక్యులేషన్ పరీక్షకు చదివిస్తాను' అనే వాగ్దానం కోసం మా అక్కను నిలదీసేడు.

ఆ మెట్రిక్యులేషన్ సర్టిఫికేటే, పార్వతిని రక్షించింది. "కొంపా పొలమూ అమ్మేసి ఆ డబ్బంతా పట్టుకొచ్చేయండి. నాకు కట్నం అంటూ ఏమీ ఇవ్వక్కర్లేదు. పార్వతితో బాటు మీరూ నాతో ఉండవచ్చు. నాకు చిన్న ఉద్యోగం వుంది గానీ; కొంచెం డబ్బుకూడా వుంటే నా స్నేహితుడొకడు పెట్టిన వ్యాపారంలో వాటా తీసుకుని అతనితో బాటు నేనూ లాభాలు గడిస్తాను." అంటూ వచ్చిన పార్వతి మొగుడు నారాయణ చిన్న వయసుకే చచ్చిపోతే; " నారాయణ తన వాటా అంతా ఏనాడో తాగేశాడు" అని ఆ 'జాయింటు'వ్యాపారస్తుడు సున్నా పెడితే; ఏడవకుండా, విచారించకుండా కాపాడింది ఆ మెట్రిక్యులేషన్ సర్టిఫికేటే. పార్వతి మొగుడు పదహారేళ్లు పనిచేశాడని దానికి పదివేల రూపాయిలకి పైగా గ్రాట్యుటీ; నెలకి నూట ఎనభై రూపాయిల ఫామిలీ పెన్షనూ కాక; అదే ఆఫీసులో సెక్షన్ రైటర్ ఉద్యోగాన్ని ఇప్పించింది, ఆ మెట్రిక్యులేషన్ సర్టిఫికేటే!

నారాయణ చనిపోయాక మా అక్క, పార్వతి, దాని కొడుకు చిదంబరం; నారాయణ గ్రాట్యుటీ డబ్బు, ఇన్సురెన్స్ డబ్బు అడ్వాన్స్‌గా ఇచ్చి ఇల్లు మారారు. ఆయింటికి అద్దె లేదు; పైగా ఈ డబ్బు కొచ్చే వడ్డీలో అద్దె మినహాయించుకుని నెలనెలా నాలుగు వందలిస్తారు. డబ్బు అవసరమైతే వీరూ, ఇల్లు అవసరమైతే వారూ ఆరు నెలల నోటీసు ఇయ్యాలి. ఆ ఒప్పందంమీద ఈ మూడేళ్ల నుంచి ఆ ముగ్గురూ ఆ ఇంట్లో వుంటున్నారు. ఉద్యోగం సుమారు ఏడు వందల జీతం ఇస్తోంది. నారాయణ సర్వీసువల్ల నూట ఎనభై రూపాయిల పెన్షన్ వస్తోంది. గొప్ప కులాసాగా కాదుగానీ, రెండు పూటలా నాలుగు వేళ్లూ నోట్లోకి పోతున్నాయి. ముగ్గురికీ- అన్న పద్ధతిలో బాగానే వున్నారు. పిల్లాణ్ణి మంచి స్కూల్లో చదివించుకుంటోంది, పార్వతి.

పార్వతికి మొగుడు పోయే సరికి ఇరవై తొమ్మిదేళ్లు. దాని కొడుక్కి తొమ్మిది. పార్వతి మళ్లీ పెళ్లి చేసుకుంటేనూ కుర్రాణ్ణి ఆ కొత్త మొగుడు ఒద్దనుకుంటేనూ; వాణ్ణి నేను తీసుకొచ్చి పెంచుతానన్నాను. నారాయణ పోయే సరికి పార్వతి దగ్గర పదిహేనువేల రూపాయిలూ కొంచెం బంగారమూ వున్నాయి. మా కులంలో ఆడది రెండో పెళ్లి చేసుకోడానికి ఆంక్షలేదు. అందులోనూ మొగుణ్ణి వదిలేసిన ఆడదానికన్నా మొగుడు పోయిన దానికి అవకాశాలు ఎక్కువ. కనక ఆ డబ్బంతా ఇచ్చేడానికి సిద్దపడితే పార్వతికి పెళ్లి అవడం పెద్ద కష్టం కాదు. కుర్రాడు అడ్డు అనుకుంటే వాణ్ణి నా పిల్లలతో బాటుగా నా ఇంట్లో పెట్టుకుని పెంచడానికి నేను సిద్ధపడ్డాను గానీ, మా అక్కే అడ్డు అయిపోయింది. ఆవిడను భరించడానికి మా ఇంట్లోనూ ఒప్పుకోలేదు; పార్వతిని పెళ్లి చేసుకునే ఉద్దేశంతో ఆ సంసారాన్ని పరిశీలించిన ఇద్దరు ముగ్గురు విధురులూ అంగీకరించలేదు. మూడు సంవత్సరాల కాలంలో నా అక్కకీ పార్వతికీ ఆ పిల్లాడికీ నా ఇష్ట పూర్వకంగా ఏమైనా ముట్ట చెప్పేనేమోగానీ, వాళ్లంతటవాళ్ళు, నన్ను ఓ పది రూపాయిలు ఇమ్మని అడిగిందిలేదు.

"పార్వతి ఇరుక్కున్న ఇబ్బంది ఎలాటిది?" అన్న ప్రశ్నకి ఒకటే సమాధానం కనబడుతోంది. పిల్లాడికి పన్నెండేళ్ళు వచ్చినా, దానికి ఇప్పుడు ముప్పయి రెండేళ్లే. గొప్ప సౌందర్యవతి కాదుగానీ అనాకారి కాదు. ఉప్పూ, కారం తింటూ పది మంది మొగాళ్ల మధ్యని అతి చిన్న స్థాయిలో (అంటే; ఇతర ఉద్యోగస్తుల్లో ఎవరు కూడా "మీరు" "పార్వతిగారు" అనడానికి అవసరం లేని) ఉద్యోగం చేస్తోంది. ఎవడైనా దీన్ని లొంగదీసుకున్నాడో, లేక ఎవణ్ణయినా ఇదే మరిగిందో, ఏ కడుపో కాలో వచ్చి ఊరుకుందోఅని నాకుభయం పట్టుకుంది.

✣ ✣ ✣

నేను ఆ ఇంటికి చేరే సరికి సాయంకాలం ఆరూ నలభై అయింది. వరండాలో కూర్చుని చదువుకుంటున్నాడు చిదంబరం. నన్ను చూడగానే "అమ్మమ్మా, మామయ్యొచ్చేడు." అని కేకపెట్టి; పుస్తకం మూసి లోపలికి పరుగెత్తాడు. నా రాకవల్ల అక్కకి సంతోషం కలిగుండాలి గానీ ఆవిడ మొహం దీనంగా పెట్టి "ఒచ్చావా సత్యం! దా; కూర్చో" అని మంచం వాల్చింది.

"పార్వతి ఇంకా ఆఫీసు నుండి రాలేదా?" అన్నాను.

"ఒక కొలువైంది. రెండో కొలువింకా కాలా."

"రెండో కొలువా?"

"అదేగదా, నా కర్మ!" అని నెత్తి కొట్టుకుంది అక్క. "సాయంకాలం ఏదైనా పార్ట్‌టైం జాబ్ చేస్తోందా?" అన్నాను.

అక్క నా మాటకి బదులు చెప్పలేదు. లోపలికి వెళ్లి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చింది. నేనవి త్రాగేలోగా మళ్లీ వెళ్లింది. ఓ నిమిషం అయ్యేక వచ్చింది. "లోపలకెళ్లి కాలూసేతులూ మొకం గడుక్కో. టీ కాస్తున్నాను." అని ఒక తుండు గుడ్డ అందించింది. మళ్లీ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

టీ తెచ్చి ఇచ్చింది అక్క కాసేపటికి.

"కూర్చో, అక్కా" అన్నాను. నేలమీద కూర్చుంది.

"ఏం జరిగింది?" అన్నాను.

"అంతా బాగున్నారా, నీ నుండి ఉత్తరమొచ్చి నాలుగు మాసాలయ్యో" అంది.

"బాగే, కానీ ఏంటైంది?" అన్నాను.

అక్క మాటాడలేదు. "టీ లో సక్కెర సరిపోయిందా?" అంది, నేను టీ గ్లాసు కింద పెట్టే దాకా వూరుకుని.

"సర్లేవే, ఎందుకు అర్జంటుగా రమ్మని కార్డేసేవు? ఏంటైందసలికి?" అన్నాను.

అక్క గ్లాసుతీసుకుని నిలబడింది." పొయ్యార్పేసొస్తా."

అని వంట గదిలోకి వెళ్లింది.

ఇట్నుంచి పార్వతి వచ్చింది.

"మామయ్యొచ్చేడు." అని చిదంబరం చెప్పిన మాట నాక్కూడా వినిపించింది. పార్వతి నన్ను 'మామయ్య' అంటుంది. అదిచూసి వాడుకూడా నన్ను మామయ్యనే అంటాడు.

పార్వతి చెప్పులు వరండాలో విడిచిపెట్టి లోపలి కొచ్చి'బాగున్నారా మావయ్యా' అంటూ నా కాళ్లమీదకి వంగి దండం పెట్టి బాత్‌రూమ్ వేపు వెళ్లింది.

అక్క వంట గది ద్వారం దగ్గిర నిలబడి వుంది. పార్వతి బాత్ రూంకీ గదికీ మధ్య ఉన్న గట్టి తలుపు బిగించి అవతల గడియ పెట్టింది. అక్క వంటింటికీ గదికీ మధ్యవున్న రేకుతలుపు మూసింది. వంట గదికీ బాత్ రూంకీ మధ్య ఉన్న తలుపు వాళ్లిద్దర్లో ఎవరు తెరిచారో తెలియదు గాని, తెరిచిన సంగతి తెలిసింది.

ఒక నిమిషం పాటు నీళ్ల చప్పుడు. ఆ తరవాత మాటలు,

గుసగుసల్లా కాదు; ఇక్కడికి వినపడేలా. ఇద్దరూ చెరో చోటి నుంచీ మాట్లాడు తున్నారు,

"ఎప్పుడొచ్చేడు?"

"అయిదు నింసాలైంది."

"ఉత్తరం ఎయ్యనన్నావుగా. ఏ సేవన్నమాట!"

"ఏస్తే ఏసాన్లే, ఆడేం పరాయోడా? మంచీ సెడ్డా సూసే వోడేగదా, నా తోడబుట్టినోడు. నీకు తండ్రిలాంటోడు".

"సంసారం గుట్టూ రోగం రట్టూ అంటావు ఇదే గాబోలు"

"ఓసి నాపా, నీకొచ్చింది రోగం గాకపోతే బోగమాయేంటే? కార్డేసాను. రమ్మన్నాను. ఒచ్చాడు, ఏంజేస్తా?"

"నాకు రోగం వచ్చిందని చెప్పేవా?"

"నేనేం జెప్పలా. నివ్వే సెప్పాల్నుంటే సెప్పు, లేదంటే గమ్మునుండు. రమ్మని కార్డేయటం పొరపాటైపోయింది, నీదార్ని నువ్వెల్లు అని సెంపలేసుకుంటే ఆడే ఎలిపోతాడు."

"అలాగేం ఎలిపోడు, అన్ని ఆరాలూ తీసే ఎల్తాడు. పరాయోడా?"

"అదీ. మాట"

"ఉద్దరించావులే."

రేకు తలుపు తెరుచుకుంది. టీ కప్పు చేత్తోపుచ్చుకుని పార్వతీ, వెనకాలే అక్కా గదిలోకి వచ్చారు.

ఏం జరిగిందర్రా అని అడగడానికి నాకు నోరు రాలేదు. ఏదో జరిగింది. పార్వతి పర్మిషన్ లేకుండా అక్క ఉత్తరం రాయించింది. అంచేత ఏం జరిగిందో చెప్పడానికి కూడా అక్కకి పర్మిషన్ లేదు. ఏం జరిగిందో చెప్పడానికి పార్వతికి ఇష్టమే లేనట్టుంది. తనకొచ్చిన ఇబ్బందిని తనే పరిష్కరించు కోగలనని పార్వతికి అనిపించడంలో వింత ఏమీ లేదు. మొదటే అది బేల కాదు. చదువుకుంది. మొగుడితో పదేళ్లు కాపరం చేసింది. మూడేళ్లయి ఉద్యోగం చేసుకుంటోంది. ఎవరిమీదా ఆధారపడకుండా తల్లినీ కొడుకునీ పోషించుకుంటోంది. నా పిల్లల కన్నా పెద్దది.

"కూర్చోవే, పార్వతీ!" అని మంచం మీద చోటిచ్చాను. ఒళ్లంతా పైట కప్పుకుని కూర్చుని టీ తాగుతోంది. కొంచెం ఉండి చీరతో పొత్తి కడుపు పూర్తిగా కప్పుకుంది.

అక్కనేల మీద కూర్చుని వంట గదివేపు చూస్తోంది. పార్వతి టీ కప్పును అటువంగి అక్క చేతికి అందించింది. అక్క కప్పు తీసుకుని వంట గదిలోకి వెళ్లింది.

"కార్డయితే అందిందనుకో, కానీ నేనందుకు రాలేదు. బెజవాళ్లో పనుండి బైల్దేరాను. ఆదివారం ఆళ్ళు దొరకరని యిక్కడ దిగాను. మీరంతా బాగే అంటే రేపాదివారమైనా బెజవాడెళి పోయి వేరేదైనా పన్చూసుకుంటాను" అన్నాను పార్వతి వేపు చూడకుండా.

"అన్నీ అబద్దాలు...." అంది పార్వతి నావేపు తిరిగి నవ్వి.

పార్వతి తలమీద చెయ్యి వుంచి నిమిరాను. 'నాపిల్లల కన్నా పెద్దదానివే. కన్న కూతుర్లాంటి దానివి. నీకేదో చిక్కొచ్చిందని అమ్మ రాయించింది. పెద్ద ముండ. చాదస్తం. నీకిస్టం లేకపోతే సెప్పనే వొద్దు. ఎవరి చిక్కులు ఆళ్లే యిప్పుకుంటం అందరికీ శ్రేయస్కరం. అంతేనా పార్వతమ్మా!?' అన్నాను.

"చెప్పడానికి ఇష్టంలేక గాదు." అని లేచింది పార్వతి. గోడకి ఉన్న అలమార తెరిచింది. చీరమడతల కింద కాగితాల బొత్తి బైటికి లాగింది. అందులోంచి ఒక న్యూస్ పేపరు తీసి పక్కని పెట్టుకుని మిగిలినవన్నీ బట్టల మడతల కింద పెట్టింది. అలమార తలుపు మూసి, న్యూస్ పేపర్ తెరిచి ఒక రకంగా మడతపెట్టి నా దగ్గిరికి పట్టుకొచ్చి ఇచ్చింది. "సదువు; ఇప్పుడే వస్తా." అని వంట గదిలోకెళ్లింది. "అమ్మా! పొద్దు బోయిందని సూడక దొండపాదులో నాలుగు కాయలున్నాయేమో సూదాంపద. నీ తమ్ముడికి దొండకాయేపుడంటే యిస్టం గదా." అని అక్కని తీసుకుని తలుపులన్నీ తీసుకుని పెరటితోటలోకి వెళ్ళిపోయింది.

**"వధువు కావలెను.**

నెలకు మూడువేల రూపాయలు నికర లాభం గల వ్యాపారం చేయుచూ ఏలూరులో స్వంత ఇల్లుగల 38 సంవత్సరాల వయసుగల, పది ఏండ్ల వయసుతో ఒక కుమార్తె గల (ఫలానా) కులస్తునికి ఇటీవలనే భార్య మరణించినందున మరల పెండ్లాడుటకు అదే కులము నుండి 30 ఏండ్లకు పై బడిన వధువు కావలయును. విధవరాలైనను అభ్యంతరము లేదు. ఈ సంబంధము ఆమోదముకానిచో పాపయోగక్షేమం సంరక్షణ చూసే "ఆయా"గా ఉద్యోగం అయినా ఇవ్వబడును. ఒకపూట భోజనము, మరియు ఏడాదికి నాలుగు సార్లు వస్త్రాలు, అదికాక నెలకు 200 రూపాయలు జీతము ఇవ్వబడును. భోజనము వస్త్రాలు అవసరము లేదని అనుకుంటే నెలకు 300 రూపాయలు జీతము ఇవ్వబడును. ఆసక్తిగలవారు సంప్రదించ వలసిన చిరునామా-"

నేను ఆ ప్రకటన ఒకసారి చదివితే ఒక ఆలోచన వచ్చింది. అతడికీ ఈమెకీ వ్యాపకాలు

న్నాయి. అతనికీ ఈమెకీ సమస్యలు కూడా వున్నాయి. అయినా వున్న మనస్సుల్ని కొద్దిగా విశాలం చేసుకుంటే అతనూ ఈమే వివాహం చేసుకోడం వల్ల ఇద్దరి సమస్యలూ పరిష్కారం అయిపోయి సుఖంగా వుండగలరు.

ఆ ప్రకటన రెండోసారి చదివాను. ఆర్థిక స్వాతంత్ర్యానికి అలవాటుపడిన పార్వతి ఈ వయసులో అతనికి భార్య అయి అతను ఉద్యోగం మానెయ్యమంటే, బానిసత్వంలోకి వెళ్ళడం అవుతుంది. ఆయాగా చేరితే తక్కువ బాధ్యతతోనే ఆదాయం పెరుగుతుంది.

ఏమని సలహా ఇవ్వాలి అని ఆలోచిస్తే వెంటనే తట్టింది; ఈ ప్రకటన ఎప్పుడు వెలువడిందో చూడాలని.

ఎనిమిది నెలలైంది.

ఇంకనేం? పార్వతి ఈ ప్రకటనకి బదులుగా ఏదో నిర్ణయం తీసుకునే వుంటుంది. ఆ నిర్ణయంలో తెలివి తక్కువ వల్ల ఏదో చిక్కులో దిగిపోయే వుంటుంది.

తల్లీ కూతురూ పెరటి తోటలోంచి వచ్చేశారు. అక్క వంటింట్లోనే వుండిపోయింది. పార్వతి వీధి వరండాలోకి వెళ్ళి "లోనకెళ్ళి అన్నం తినరా కన్నా!" అని చిదంబరాన్ని తీసుకొచ్చేసింది. అక్క ఓ వంక కూరగాయ సంగతి చూస్తూనే మనవడికి కంచం పెట్టింది. పార్వతి నన్ను లెమ్మని సంజ్ఞ చేసి మంచం తెచ్చి వీధి వరండాలో వాల్చింది. నేనక్కడ కూర్చున్నాక తను ఒక స్టూల్ తెచ్చుకుని దానిమీద కూర్చుంది.

"సదివావా?"

"ఆ"

"ఏంటి నీ వుద్దేసం?" నవ్వింది.

"అంటే? నువ్విప్పటి దాకా ఏం అనుకోనే లేదా?"

"అనుకున్నాలే. పెద్ద దిక్కువుగదాని అడుగుతున్నా."

"నా మొహం, నేను పెద్ద దిక్కేంటి? నియ్యంత దానివి నువ్వు."

"అదేం లేదు. నువు జెప్పేది గూడా ఇనొచ్చుగా."

"అట్టైతే చక్కగా ఆయన్ని పెళ్ళి చేసుకో."

" ఆలైను మీదే ఎల్లాను. కానీ కుదర్లా."

"ఏం, ఎందుకని?"

"నాకున్నట్టే ఆయనకీ తల్లుంది. పెల్లి జేసుకుంటే ఈళ్ళిద్దరూ జుట్లట్టుకుంటం తప్పదని ఓసారి సూస్తలికే తెల్సిపోయింది."

"అమ్మ అలాంటిది గాదే; సద్దుకుపోదూ?"

"మాయమ్మ కేమి? బంగారం. ఆయమ్మే; సూర్పనక, సుప్పనాతి!"

"కోడల్లేని అత్త గుణవంతురాలు."

"అయ్యన్నీ తీసెయ్. ఆయమ్మ పేరు పేట పేటంతా మోతకిందుంది. పెల్లి జేస్కుంటే మాయమ్మగానీ నా కొడుగ్గానీ నాతో వుంటానికీల్లేదని కండీసనెట్టింది. అదీగాక ఆయన కూతురైతే

వారం తిరిగే తలికి పిస్నీ పిస్నీ అంటం నేరుస్తది గాని నా కొడుకు ఎదిగొస్తన్నాడే; అమ్మనైయుండి నేనింకో మొగుడికెల్తే ఆడి గుండెల్లో పుండు పడద్ది గదా. "

"అటయితే ఆయన జోలికి బోక నీ బతుకు నువ్వు బతకాల్సిందే. ఈ రెండు మూడొందల రాబడి లేకపోతే మాత్రమేం?"

"అట్లాగని వూర్కోబుద్ది గాలా. ఆయాగా జేరొచ్చన్నాడుగా. ఆ సంగతాలోసించా. ఏం పెద్ద పని గాదు. తెల్లార్రి ఆరింటికి ఎల్లాలి. పాలూ నీల్లూ తోముడూ కడుగుడూ, స్నానాలు, వొంటా, ఆ పాపకి జడేసి గౌను దొడగటం, అన్నీ తొమ్మిదైతలికి సరి. మల్లీ సాయంకాలం నా ఆపీసులో డూటీ దిగాక ఆరు గంటల్లోగా ఎల్తే అరగంటా నలభై నింసాల పని. నాకు నీ ఇంట్లో బోజినం ఒద్దు; నీ సీర్లూ జాకట్లూ ఒద్దు అన్నాను. నెలకీ మూడు వందలిచ్చేస్తన్నాడు."

"బాగానే వున్నట్టుంది. జీతంలో కొంత ఎలాగో వెనకేస్తున్నావట. ఇదికూడా మిగుల్చుకుంటే కుర్రాడు సుకపడతాడు. మంచాలోచెనే."

"అలాగనుకునే జేరాను. కానీ ఆయినికీ సాగలేదు, నాకూ సాగలేదల్లాగ."

ఒక్క వాక్యంలో బోలెడు కథ చెప్పింది. మాటల అర్థం కన్నా కథ నిడివి నన్ను కొంచెం సేపు మాటాడకండా ఆపింది.

"అంటే; అమ్మ ఉత్తరంలో రాసినట్టు ఏదో చిక్కులో పడ్డావా?" అన్నాను.

"చిక్కంటే చిక్కే మరి. సెప్పినా యిన్నా సిరాకేస్తది. "

"అయితే చెప్పకు."

"చెప్పకెల్లా? నేను జెప్పకపోయినా అమ్మ చెప్పుద్ది. ఇంతవరవుకూ ఒచ్చినాక నువ్వింకో నోటిమీద యినేకంటా నేను జెప్పటమే రయిటు... జేరిన రెన్నెల్ల వరవుకూ బానే వున్నాం. ఆ యెనక దొంగ సూపులూ ఉత్తుత్తి ఆస్యాలూ పడ్డాయి..... అవుసరం పడింది. రెండొందలు ఎడ్వాన్సిచ్చి జీతంలో యిరగ్గోస్కోమన్నాను. నెలతిరిగేతలికి రెండొందలు ఇరగ్గోస్కోకండా జీతమంతా ఇచ్చేసాడు. ఇదేంటని అడగబొయ్యాను. ఎల్లెల్లు, తరవాత మాటాడదారన్నాడు. ఆ మర్రోజాదివారం. ఉదయం పన్లోకెల్తలికి ముసిలామెనీ పిల్లనీ రిచ్చా ఎక్కిచ్చి తనూ మోటర్ సైకిల్ దీసాడు. సెనివారప్పేట్లో యవరికో పెల్లి; పగులంతా అక్కడే వుంటాం; సాయింకాలం రామన్నాడు. సాయింకాలం ఎల్తడికి తనొక్కడే వున్నాడు. పనంతా అరగంట్లో అవగొట్టేసాను. వాకిట్లో గేటుకి పక్కసాటుగా రెండు కుర్చీలేశాడు. నన్ను కూసోబెట్టి లోన కెల్లొచ్చాడు. అంత వరవుకూ నన్నంటుకోని మనిసి రెండు వొంద కాయితాలు సూపించి నా సేతులో తురిమి సెయ్యి తనే ముడిశాడు. "సీర కొనుక్కో." అన్నాడు. నా కర్దమైపోయింది. నే నటాంటి దాన్ని గాదని జెప్పి నిమ్మదిగా కాయితాలిచ్చీ బోయాను.

"ఉంచూ, వుంచూ" అని రెండు సేతులా కాయితాలు మల్లా నా సేతిలో తురిమాడు. నేను మాత్రం అటాంటోన్నా అన్నాడు. ఒకరికొకరు తోడుండాలి. సాయంజేస్కోవాలన్నాడు. అసలీ ముసల్ది లేకపోతే మనం పెల్లే జేస్కునే పని గదా అన్నాడు. దూరం దూరంగా గూర్చొనే మంచీ సెడ్డా మాటాడుకున్నాం. సిన్న పిల్లలం గాదుగా. టయిము కలిసొచ్చే వరవుకూ ఎవరి మటుకాళ్ళే వుందామని తీరుమానం జేసుకున్నాం. కానీ యెన్నాల్లో వుళ్ళేకపోయాం. ఒకల్లంటే వొకల్లకి యిష్టం గనక ఆయినూ తట్టుకోలేదు. నేనూ బెట్టుకి పోలేదు. నువ్వేమంటే అను. ఆయనికీ నాకూ కల్సిపోయింది."

వివరాలు ఇవి అని తెలియకపోయినా విశేషం ఇదేనని ముందే తెలిసింది. తల్లి వుండగా ఎదిగొస్తున్న కొడుకు వుండగా మంచికీ చెడ్డకీ మేనమామని నేనుండగా పార్వతి ఇలా ఆయా ఉద్యోగం సాకుపెట్టి అతగాడితో పోతోందంటే అసహ్యించుకోవాలి, చిరాకు పడాలి, చీవాట్లు పెట్టాలి. కాని పార్వతి మాటలో నిజాయితీ నన్ను లొంగ తీసుకున్నట్టుంది. అవును, తనుమాత్రం ఏం చేస్తుంది? ముప్పయి రెండేళ్ళకే ముక్కు మూసుకుని మూల కూచుంటుందా అని సమర్థించుకునే ధోరణిలో పడిపోయాను. "పోనీలే. బతుకు మోడై పోకుండా ఏదో నీకొక ఏర్పాటు దొరికింది. అతిగా పోకుండా గుట్టుగా వుండు. ఇప్పుడు లోకంలో ఇలాంటివి ఎన్ని జరగడం లేదు గనక!" అని దాన్ని ప్రోత్సహించడానికి సిద్ధపడి పోయాను.

నా మాటలు నా నోట్లోనే వుండగా పార్వతి మళ్ళీ చెప్పడం మొదలెట్టింది. "ఆర్నెల్ల మట్టీ మేం తిరిగింది నెలకి మూణ్ణాలుగు సార్లే అయినా నేనొక్క మాటనకుండా ఆయన నా ఎదాన్నెంత పోసాడని! పదివేలు దాటుంటాది. 'నువ్వు నాకిచ్చిన జీవం ముందు ఇదేమాత్రం పారువతీ' అంటాడు. యాపారంలో రాత్రి పగల్లు కష్టబడతాడు. లాబాలు బాగా పెరిగినయ్యంట. ఒద్దంటే పూరుకోడు. ఆకరుకి ఇప్పుడే వరస కొచ్చిందంటే మా యమ్మకి నేను నచ్చజెపుతాను; కొన్నాల్లపాటు మియ్యమ్మనీ నీ కొడుకునీ మీ మామయ్య దగ్గిరో మరో వూర్లోనో యేరుబెట్టి నన్ను పెల్లిజేసుకో; నిన్నొదిలుండ్లేంటాడు."

అగి మాత్రం శుద్ధ తప్పు.

ఒకటి - అక్కనీ చిదంబరాన్నీ నేను భరించలేను. కుర్రాడొక్కడూ అంటే ఎలాగో నా ఇంట్లో నచ్చజెప్పగలను. కాని అక్క మా ఇంటికొస్తే కొన్ని చిక్కులు వాటంతట అవే పుట్టుకొస్తాయి.

రెండు-పార్వతి అతన్ని పెళ్ళి చేసుకున్న మరుక్షణం దానికి మొదటి మొగుడి ఉద్యోగం ద్వారా వస్తున్న పెన్షన్ ఆగిపోతుంది. ఆ డిపార్టుమెంటు వాళ్ళు అటూ ఇటూ చూసి ఈవిడ చేస్తున్న ఉద్యోగం కూడా ఊడగొడతారు. అలా అయినా కాకపోయినా పెళ్ళి అంటూ చేసుకున్నాక ఆ అత్తగారు ఈమెని ఉద్యోగానికి వెళ్ళనిస్తుందనుకోడం కూడా పొరపాటే. 'ఇల్లు చూసుకో చాలు.' అని ఆజ్ఞాపిస్తారు. అంత స్థితిపరుణ్ణి పెళ్ళి చేసుకుని ఇంకా ఉద్యోగం దేనికని ఎవరికైనా అనిపిస్తుంది. దాంతో నెలకి వెయ్యి రూపాయల రాబడి ఆగిపోతుంది. అంతేకాక ఆయాగా తనకి వస్తున్న మూడు వందలు ఇంక మీదట రాదు. ఆయాకి జీతం ఇస్తారుగాని పెళ్ళాలకి ఇవ్వరు కదా.

అప్పుడు -

పార్వతి ఈ ఇంటి యజమానికి అప్పు పెట్టిన పదిహేను వేల రూపాయలు; మూడేళ్ళుగా తను తెచ్చుకుంటున్న జీతంలో మిగుల్చుకున్నవి మహా వుంటే ఐదువేలు; ఇంకా లెక్కచూస్తే అతను పార్వతికి దొంగ చాటుగా ఈ ఆర్నెల్లలో ముట్టచెప్పింది పదివేలటగా, అదీ మొత్తం ముప్పయివేలు. ఇదంతా ఇచ్చేసి అక్కనీ చిదంబరాన్నీ వేరు పంపించేస్తే ఆ డబ్బు వాళ్ళకి ఎన్నాళ్ళొస్తుంది? మహా అయితే నాలుగేళ్ళు. నాలుగేళ్ళలో చిదంబరం మెట్రిక్ పాసవ్వచ్చు. కాని వాడికి పదహారేళ్ళే వస్తాయి.

లెక్కలన్నీ విడమర్చి చెప్పి ; అక్క ఒకందుకూ పార్వతి మరొకందుకూ ఏడుస్తూ వుంటే, నిర్దాక్షిణ్యంగా రాత్రికి రాత్రి బయలుదేరి వచ్చేశాను.

✣ ✣ ✣

నాలుగు నెలలయింది. మా రెండో అబ్బాయి ఇంటర్మీడియట్ పరీక్ష చాలా బాగా

రాశానన్నాడు. ఎమ్‌సెట్ కోచింగుకి గుంటూరు వెళ్ళి నలభైరోజులయింది. "మీ అక్కకి చాలా జబ్బుగా వుంది. వెంటనే బయలుదేరండి." అని గుంటూరు నుంచి ఆ కోచింగ్ సెంటరు ప్రిన్సిపాల్ ఇచ్చిన టెలిగ్రాం చూసుకుని వెళ్ళాను.

"మా అక్కేమిటి, గుంటూరేమిటి, కోచింగ్ సెంటరు ప్రిన్సిపాల్ టెలిగ్రాం ఇవ్వడమేమిటి?"

✤ ✤ ✤

నేను ఏలూరు వదిలిన మరుసటి వారంలో సుబ్బయ్యగారు (పార్వతి రక్షకుడు) అక్కనూ చిదంబరాన్నీ గుంటూరు తీసుకువెళ్ళి ఆ కోచింగ్ సెంటర్‌కి అనుబంధంగా వున్న మెస్‌లో వంట పనుల్లో సహాయపడడానికి అక్కను చేర్చాడు. అందుకు ప్రతిఫలంగా చిదంబరం చదువు బాధ్యతా వాళ్ళిద్దరి వసతి భోజనాల బాధ్యతా ఆ కోచింగ్ సెంటరు యాజమాన్యానికి వప్పగించాడు. పార్వతి తాను కూడ బెట్టుకున్న డబ్బు నలభై వేలు చేసి గుంటూరులో ఒక బ్యాంకిలో ఫిక్సెడ్ డిపాజిట్ వేసి దాని మీద వచ్చే వడ్డీ నెలనెలా అక్కకి చెల్లించే ఏర్పాటు చేసింది.

ఈ టెలిగ్రాం-

రెండు రోజుల కిందట మెస్‌లో అక్క నిద్రపోతూ వుండగా పాతబడిన ఆ ఇంటి పైకప్పు కూలి ఆమెకు తలపైన బలమైన గాయాలుతగిలాయి. సుబ్బయ్యను ఫోన్‌చేసి రప్పిస్తానని ఆ ప్రిన్సిపాల్ గారు ధైర్యం చెప్పినా నాకు కూడా ఒక టెలిగ్రాం ఇమ్మని అక్క అడిగిందట.

నేను వెళ్ళే సరికి ఆస్పత్రిలో అక్క బెడ్ పక్కన వున్న నడి వయసు మనిషి నన్నెంత కాలం నుండో ఎరిగున్న వాడిలాగా మాట్లాడాడు. తను పార్వతి రెండవ భర్తనని పరిచయం చేసుకుని ఆ తరువాత ప్రతి మాటకీ 'బాబాయిగారూ!' అని కలిపి మరీ మాట్లాడాడు.

"పార్వతి రాలేదా!" అన్నాను.

"లేదు, బాబాయిగారూ." అన్నాడు.

నాకు ఆ పిలుపు చిరాకు పుట్టించింది 'ఏం భ్రష్టో! తల్లిచావు బతుకుల మీద వుంటే కూడా-'

"సారీ బాబాయిగారూ, పార్వతి నర్సింగ్ హోంలో వుంది. ఈ రాత్రికి పురుడొస్తుందని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం. నేను వెంటనే వెళ్ళాలి. మీరొక్క నాలుగు రోజులిక్కడుంటే డాక్టర్‌గారి అనుమతి తీసుకుని ఈవిణ్ణి ఏలూరు తీసుకుపోతాను, బాబాయిగారూ!"

"మీ అమ్మగారున్నారుగా, కంగారు దేనికి?"అన్నాను.

"సారీ బాబాయిగారూ! మా అమ్మగారు కాలం చేసేరు. ఇవాల్టికి ఏడవ రోజు. పెద్ద కర్మకి దయచెయ్యమని తమకి ఉత్తరం వేశాను. ఉత్తరం అలా వెళ్ళింది; తమరిల్లా వొచ్చేశారు; బాబాయిగారూ!"

"అయ్యో అలాగా, పాపం!" అని ఇంకా ఏదో అందామని నోరు తెరిచాను.

"ఇట్స్ ఆల్‌రైట్, బాబాయిగారూ!" అని జవాబు చెప్పేసి నా బుజం నొక్కి అటు తిరిగి వెళ్ళిపోయాడు సుబ్బయ్యగారు.

అస్తిత్వ భావంతో నా తల బరువెక్కి కిందకి వాలింది. ❋

*("ఆంధ్రజ్యోతి" వీక్లీ : దీపావళి 90)*